క్లుప్తంగా

అర్బన్ తహసీల్దార్ భవనం పనుల పరిశీలన

సీటీఆర్ఐ: అర్బన్ తహసీల్దార్ నూతన కార్యాలయాన్ని పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ మాధవీలత అన్నారు. గురువారం జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్, ఆర్అండ్‌బీ ఎస్ఈ ఎస్బీవీ రెడ్డితో కలసి స్థానిక వై.జంక్షన్‌లో నిర్మిస్తున్న ఆ కార్యాలయ భవనం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకూ మంజూరు చేసి, విడుదల చేసిన రూ.90 లక్షలతో పనులు పూర్తి చేసినట్లు అధికారులు వివరించారు. పెండింగ్ పనులకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు. ఆర్డీవో ఎ.చైత్ర వర్షిణి, డీఈ బీవీవీ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ సుస్వాగతం పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

రాజమహేంద్రవరం సిటీ: జేఎన్ రోడ్డు శిరిడి సాయిమార్గ్‌లోని డ్రైనేజీలో పడి ఏరుకొండ నాగేశ్వరరావు మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబానికి న్యాయం చేయాలంటూ కమిషనర్ దినేష్ కుమార్‌కు జనసేన నగర ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ గురువారం వినతి పత్రం అందజేశారు. డ్రైనేజీ నిర్మాణం సకాలంలో పూర్తి చేయని కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలైందన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత ప్రారంభం



అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న కార్మికులు

రాజమహేంద్రవరం సిటీ: అక్రమ కట్టడాలను ఉపేక్షించేది లేదని కార్పొరేషన్ కమిషనర్ కె.దినేష్ కుమార్ స్పష్టం చేశారు. నగరంలో గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చివేతకు గురువారం సిటీ ప్లానర్ సూరజ్ కుమార్ నేతృత్వంలో ప్రణాళికా విభాగ సిబ్బంది చర్యలు చేపట్టారు. కాగా.. బుధవారం కమిషనర్ దినేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీలు చేపట్టి, గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు ఆదేశాలిచ్చారు. మహావీర్ స్ట్రీట్, మెరక వీధి, ఇన్నీస్‌పేట, గెయిల్ కార్యాలయ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాల కూల్చివేతను ప్రారంభించినట్టు సూరజ్ కుమార్ తెలిపారు.

ఇంటర్‌లో ఎస్‌కేఆర్ ప్రతిభ

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి గురువారం తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో ఆర్.నిహారిక 983, అమీనాఖాన్ 952, దీవెన జ్యోతి 930, సీహెచ్.అమూల్య 929, లావణ్య 929, సిరియో గ్లాడ్స్ 928, ప్రసన్న 915, స్రవంతి 901 మార్కులు సాధించారన్నారు. ఆ విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, కళాశాల ప్రత్యేక అధికారి డాక్టర్ సీహెచ్.కృష్ణ అభినందించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించిన వెంకటస్వామి నాయుడు, చిత్రంలో గిరజాల బాబు

కడియం: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద దొడ్డా శ్రీను జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, దొడ్డా బుజ్జి, లావేటి రమేష్, ప్రసాద్, గణేష్ పాల్గొన్నారు.

ఒకటిన బహిరంగ సభ

ప్రకాశం నగర్: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా మే ఒకటిన కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఆయన గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే ప్రదర్శన తాడితోట, బైపాస్ రోడ్డు, చర్చిగేట్, జాంపేట, అప్సర థియేటర్ మీదుగా కూరగాయల మార్కెట్‌కు చేరుకుంటుందని, అక్కడ బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ సభకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

బైబిలు మిషన్ మహిమోత్సవాలు ప్రారంభం

కడియం: జేగురుపాడులోని ఫాదర్ ఎం.దేవదాసు మెమోరియల్ గ్రౌండ్‌లో గురువారం బైబిలు మిషన్ మహిమోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులు పాటు ఈ కార్యక్రమాలు జరుగుతాయి. వివిధ ప్రాంతాల నుంచి ప్రముఖులు హాజరవుతారని నిర్వాహకులు వివరించారు. కె.రక్షణానంద్, కె.జోనా సత్య దేవదాస్ నేతృత్వంలో జరిగే ఈ కార్యక్రమాల్లో బైబిలు మిషను ప్రెసిడెంట్ డాక్టర్ పి.సజీవరావు, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఏ.దైవారావు, గవర్నింగ్ బాడీ మెంబర్ కె.జయకర్ తదితరులు పాల్గొంటారన్నారు.

పోటీ ఏదైనా.. వీరిదే పైచేయి



విద్యార్థినులను అభినందిస్తున్న బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రావి విజయదుర్గ



మొబైల్ మెకానిక్స్, పెట్రోల్ బంక్ ప్రాజెక్టుతో విద్యార్థినులు

- సత్తా చాటుతున్న ధవళేశ్వరం విద్యార్థినులు
- అన్నిరంగాల్లో అద్భుత ప్రతిభ

ధవళేశ్వరం: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సత్తా చాటుతున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపుతూ ప్రశంసలు అందుకుంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగానికి అధిక ప్రాధాన్యత నిస్తూ నాడు–నేడు ద్వారా పాఠశాల రూపురేఖలను సమూలంగా మార్చారు. ఆయన లక్ష్యానికి అనుగుణంగా ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు అన్నింటా విజయబావుటా ఎగురవేస్తున్నారు. ఇటీవల జరిగిన ఎంటర్‌ప్రిన్యూర్ మైండ్ సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎమ్‌డీపీ) ఎక్స్‌పో–2023కు జిల్లా నుంచి ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన మొబైల్ మెకానిక్స్ పెట్రోల్‌బంక్ ప్రాజెక్ట్ ఎంపికైంది. రాష్ట్ర వ్యాప్తంగా 52 ప్రాజెక్టులు ఎంపిక చేయగా అందులో ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన ప్రాజెక్టు ఒకటి.

చిట్టిబుర్రలు.. చక్కని ఆలోచనలు

ధవళేశ్వరం బాలికోన్నత విద్యార్థినులు తయారు చేసిన మొబైల్ మెకానిక్స్, పెట్రోల్ బంక్ ప్రాజెక్ట్ ప్రశంసలు అందుకుంటోంది. జాతీయ రహదారులపై పెట్రోల్ అయిపోయినా, రిపేర్లతో వాహనాలు ఆగినా ఏ విధమైన సహాయ సహకారాలు లేని ప్రదేశాల్లో వాహనాలు ఇబ్బందులకు గురి కాకుండా ఫోన్‌కాల్ ద్వారా మెకానిక్‌ను ఆయా ప్రదేశాలకు పంపి వారి అవసరాలు తీర్చే విధంగా ఈ ప్రాజెక్టును రూపొందించారు. పాఠశాల మ్యాథ్స్ టీచర్ జి.సంఘమిత్ర ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థినులు స్నేహాంజలి, కుష్మిత హారిక ప్రాజెక్టును తయారుచేశారు.

విద్యతో పాటు అన్నింటా

విద్యతో పాటు ధవళేశ్వరం బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు అన్నింటా ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ విద్యాసంవత్సరంలో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో వీరు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. కరాటేలో సైతం సత్తా చాటుతున్నారు. పదో తరగతి ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించడంతో పాటు అత్యధిక మార్కులు సాధించి మిగిలిన పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

సమష్టి కృషితోనే



ఉపాధ్యాయులు, విద్యార్థినుల సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలను సాధించగలుగుతున్నాం. విద్యతో పాటు అన్నింటా విద్యార్థినులను ప్రోత్సహిస్తున్నాం. వారిలో దాగిఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. మా విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపడం ఆనందంగా ఉంది.
– ఆర్.విజయదుర్గ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు

క్రీడలతో యువతలో స్నేహసంబంధాలు



రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: క్రీడలతో యువతలో స్నేహ సంబంధాలు బలపడతాయని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, గ్రీనింగ్అండ్‌బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్యనగర్‌లో సంగిత సత్యనారాయణ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం కొద్దిసేపు క్రికెట్ ఆడారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఈ క్రికెట్ టోర్నీలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 49 జట్లు పోటీ పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు (బాబు), పార్టీ నాయకులు సంగిత వెంకటేశ్వరరావు, రాణా హరిశ్చంద్ర, సంగిత రవి, సింగన చంద్రరావు, బంగారాజు, శివరాం, సతీష్ పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి

ధవళేశ్వరం: గ్రామంలోని ఎర్రకొండ ప్రాంత యువకులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి గురువారం రెండు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతిభ ఉన్న క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడా ప్రాంగణం నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మత్స్యేటి ప్రసాద్, గ్రామ అధ్యక్షుడు పండూరి అప్పారావు, దొడ్డి బాబ్జీ పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులకు క్విజ్ పోటీలు



పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: వసుధైక కుటుంబం అనే భావన మన దేశానికి ఆయువుపట్టు అని జిల్లా విద్యా శిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం బొమ్మూరులోని జిల్లావిద్యాశిక్షణాసంస్థ, రాజమహేంద్రవరం వివేకానంద కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో డైట్‌లో మన భారత్ గురించి తెలుసుకోవడం, వసుధైక కుటుంబం అనే అంశాలపై క్విజ్ పోటీలు, పేపర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. వివేకానంద కేంద్రం ప్రచారకర్త జి.శ్రీనివాస్ విద్యార్థుల గ్రూప్ ప్రజెంటేషన్‌ను ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమానికి సమన్వయకర్తలుగా జానకీ దేవి, చూడామణి వ్యవహరించారు. అధ్యాపకులు కేవీ సూర్యనారాయణ, సుజాతరత్నం, డీఎస్‌వీ సత్యనారాయణ, ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు కూలీల ధర్నా



కడియంలో ధర్నా చేస్తున్న జట్టు కార్మికులు

కడియం: మండల కేంద్రమైన కడియంలోని రైసు మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికులకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. కడియంలోని మూడు రైసుమిల్లుల్లోని కార్మికులకు 2023–25 అనగా రెండేళ్లకు కూలిరేట్లు ఒప్పందం చేయాల్సి ఉందన్నారు. కానీ యాజమాన్యాలు కాలయాపన చేస్తున్నాయన్నారు. ధర్నాలో రైసుమిల్లు జట్టు కార్మిక సంఘం నాయకులు చీకట్ల వెంకటేశ్వరరావు, గోవిందు, బాబీ, శ్రీను పాల్గొన్నారు.

లెక్చరర్లు లేకపోవడంతో ఫెయిలయ్యాం

- యాజమాన్యం బాధ్యత వహించాలి
- కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన



బొమ్మూరు ఏఎంజీ జూనియర్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం రూరల్: కళాశాలలో లెక్చరర్లు లేకపోవడంతో ఇంటర్‌లో ఫెయిలయ్యామని, దీనికి కళాశాల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలంటూ బొమ్మూరులోని ఏఎంజీ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గురువారం ఆందోళన చేపట్టారు. దీనిపై కళాశాల యాజమాన్యం వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఫ్యాకల్టీలకు జీతాలు చెల్లించాలంటూ తమ నుంచి రూ.10 వేలు చొప్పున ఫీజులు వసూలు చేశారన్నారు. కళాశాలలోని 27 మంది విద్యార్థుల్లో 25 మంది ఫెయిలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కళాశాల యాజమాన్యం నుంచి ఒక లెక్చరర్ వచ్చి విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడినప్పటికీ శాంతించలేదు. ఒక విద్యార్థిని తల్లి పెట్రోలు బాటిల్ తీసుకుని తమకు న్యాయం జరగకపోతే ఒంటిపై పోసుకుంటానని హెచ్చరించింది. దీంతో బొమ్మూరు ఎస్సై శివాజీ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడినప్పటికీ ఆందోళన విరమించలేదు. కళాశాల యాజమాన్యం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో బొమ్మూరు ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, ఎస్సై శివాజీ ఈ విషయాన్ని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ కార్యాలయం ఆర్ఐ ఎంఎస్‌వీఎల్ నరసింహం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన సంఘటన స్థలానికి చేరుకుని విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. లెక్చరర్లు లేరన్న విషయం ముందుగానే తమ దృష్టికి తీసుకువస్తే వారిని ఏర్పాటు చేయడం లేదా, ఇతర కళాశాలల్లో విద్యార్థులను సద్దుబాటు చేసేవారమని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు మాట్లాడుతూ మే 24 నుంచి జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు నాణ్యమైన ఫ్యాకల్టీలను ఏర్పాటుచేసి తరగతులు నిర్వహించేలా కళాశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి ఆర్ఐవో నరసింహం కళాశాల యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాజా, సభ్యులు వారికి మద్దతుగా నిలిచారు.

వివాహిత ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్‌సిటీ గ్రామంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో గొల్లపల్లి దుర్గ (30) గురువారం ఉదయం ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పుల బాధతోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని దుర్గ అన్నయ్య షేక్ ఖాసీమ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దుర్గకు భర్త నారాయణ, పాప, బాబు ఉన్నారు. బొమ్మూరు ఎస్సై ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

80 కిలోల గంజాయితో ముగ్గురి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: లాడ్జిలో దాచిన గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను బొమ్మూరు పోలీసులు అరెస్టు చేశారు. రాజమహేంద్రవరం కోటిలింగాలపేటకు చెందిన కోమర్తి నాగ తారకరామారావు ఇటీవల ఏజెన్సీ నుంచి కొనుగోలు చేసిన 80 కిలోల గంజాయిని లాలాచెరువులోని ఓ లాడ్జిలో ఉంచాడు. అక్కడ ఉత్తర ప్రదేశ్‌కు చెందిన అభిషేక్ కుమార్, దేశ్‌రాజ్‌కు గురువారం ఆ గంజాయిని విక్రయిస్తున్న సమయంలో బొమ్మూరు ఎస్సై జగన్‌మోహనరావు, సిబ్బందితో దాడి చేశారు. ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ తెలిపారు.

మరో ఘటనలో..

మోరంపూడి మహాలక్ష్మి మార్కెట్ వెనుక బుధవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని ఎస్సై ఆర్.శివాజీ అదుపులోకి తీసుకున్నారు. వీరిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అప్పరాములంకకు చెందిన దేవ ఆకాష్.. తమిళనాడుకు చెందిన రాజేంద్రన్ కుమారన్, సెల్వరాజ్‌కు 25 కిలోల గంజాయిని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు.

ఇంటర్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



మేఘన, ఓకేషనల్, 976



అనూష, సీఈసీ, 968



కమలిని, బైపీసీ, 961

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ పరీక్షలలో రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రతిభ కనబర్చారని ప్రిన్సిపాల్ ఎస్ఎస్ఎల్‌వీ నరసింహం తెలిపారు. జనరల్ విభాగంలో ఎంపీసీలో షేక్ రాజ్యానా 945, బైపీసీలో కమలినీ 961, ఆర్ట్స్ గ్రూప్స్‌లో ఎం.అనూష 968 మార్కులు సాధించారన్నారు. వొకేషనల్ విభాగంలో ఎస్.మేఘన 976 మార్కుల సాధించి కళాశాల టాపర్‌గా నిలిచిందన్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో శ్రీదేవి 443, సీఈసీలో శిరీష 448, వొకేషనల్‌లో లావణ్య 480 మార్కులను సాధించారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.

దంత వైద్యశిబిరం

సీతానగరం: రఘుదేవపురంలోని డాక్టర్ సత్యం రమేష్‌బాబు హాస్పిటల్లో రాజమహేంద్రవరం సాయిరామ్ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం దంత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్లు రామ్‌కుమార్, శ్రీలేఖ, సత్యం రమేష్‌బాబు.. 50 మందికి దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈర్పిన సుధాకర్, పరిమి వెంకటకృష్ణ, వై.వెంకట నారాయణ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం



వీరవరంలో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

- కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వీరవరంలో గడపగడపకూ..

కడియం: ప్రజా సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. మండలంలోని వీరవరంలో గురువారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చందన నాగేశ్వర్.. సచివాలయం– 1 పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం ద్వారా ఆ కుటుంబాలకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరించారు. లబ్ధిదారులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుధ్యం, మురుగునీటి సమస్యలపై ప్రజలను ఆరాతీశారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ దొంతంశెట్టి వీరభద్రయ్య, స్థానిక నాయకులు బత్తుల రాము, రేమళ్ల ప్రసాద్, రేమళ్ల హరీష్, బత్తుల రాజబాబు, కొత్తపల్లి రాము, దొంతంశెట్టి చినవీర్రాజు, లంక కనకయ్య, ఎం.రాంబాబు, పెనుగొండ పోసయ్య, బచ్చు కృష్ణారావు, గుర్రపు సుబ్బారావు, వీర్లపాటి వీరేంద్రరాజు, చందన షణ్ముఖ, సూర్యారావు, శాప్‌డైరెక్టర్ భీమిరెడ్డి నాగేంద్ర, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఈలి గోపాలం, జేసీఎస్ చైర్మన్ తాడాల విష్ణుచక్రవర్తి, కడియపులంక సొసైటీ చైర్మన్ తిరుమలశెట్టి శ్రీనివాసు, కొత్తపల్లి వేంకటేశ్వరరావు, ఊటుకూరి శైలజ, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

- టీడీపీ నాయకుల తీరు అనైతికం
- వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న నక్కా శ్రీనగేష్

రాజమహేంద్రవరం రూరల్: ఎంపీ భరత్ రామ్ హయాంలో జరుగుతున్న రాజమహేంద్రవరం అభివృద్ధిని చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు నక్కా శ్రీనగేష్ అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నగరం అభివృద్ధి చెందుతోందంటే పార్టీలకు అతీతంగా అందరూ హర్షిస్తున్నారని, ఎంపీ భరత్ రామ్‌ను అభినందిస్తున్నారన్నారు. కానీ టీడీపీ నేతలు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసు మాత్రం బోరున ఏడుస్తున్నారని విమర్శించారు. నగరంలోని సాయి మార్గ్ డ్రైనేజీలో వ్యక్తి మృతి వెనుక ఆదిరెడ్డి వాసు రాజకీయ కుట్ర ఉందనే అనుమానం కలుగుతోందని ఆరోపించారు. భరత్‌రామ్ విజన్ ఉన్న నాయకుడని, ఆయనతో అభివృద్ధి పరుగును అందుకోవడం ఎవరి తరం కాదన్నారు. గతంలో భిన్న ధ్రువాలుగా ఉన్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి, జక్కంపూడి రామ్మోహనరావు అభివృద్ధికి పోటీపడేవారని, నాయకత్వ లక్షణమంటే అదీ అని నగేష్ అన్నారు. పార్టీ నగర బీసీసెల్ అధ్యక్షుడు మజ్జి అప్పారావు, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ ఆరీఫ్, గుత్తుల భాస్కర్ మాట్లాడారు. సమావేశంలో పోలు విజయలక్ష్మి, ఎన్వీ శ్రీనివాస్, మానే దొరబాబు, బూరాడ భవానీ శంకర్, దాసి వెంకట్రావు, గారపాటి చినబాబు, బిల్డర్ చిన్న, దుంగా మంగ, దుంగా సురేష్, ఓంకార్, కొయ్యన పెద్దిరాజు, కొమ్మోజు దుర్గారావు, తిరగాటి దుర్గ పాల్గొన్నారు.

సమగ్ర శిక్షతో పలు కార్యక్రమాలు



మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ స్నేహలత

కంబాలచెరువు: ప్రత్యేక అవసరాల పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ జిల్లా కోఆర్డినేటర్ స్నేహలత అన్నారు. జిల్లాలోని 19 మండలాల ఐఈ ఎడ్యుకేషన్ రిసోర్స్ టీచర్లతో గురువారం ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి సెలవుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పాఠశాల రికార్డుల నిర్వహణ, భవిత ఉప కేంద్రాల్లో ఏర్పాట్లు, బడి బయట పిల్లల సమగ్ర సమాచారం సేకరించడం, రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థులకు కావాల్సిన ఉపకరణాల పంపిణీకి ప్రణాళిక సిద్ధం చేయడం తదితర అంశాలను చర్చించారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఆదేశాల మేరకు అజెండా ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించినట్టు సమగ్ర శిక్ష సహ ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ కన్నబాబు తెలిపారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ జయంతి శాస్త్రి పాల్గొన్నారు.

పాఠశాల పనితీరు మూల్యాంకనంపై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: పాఠశాల పనితీరు మూల్యాంకనంపై స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి నిర్వహించిన వెబెక్స్ సమావేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసి, వేసవి సెలవుల్లో విద్యాశాఖ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో 'చదవడం మాకు ఇష్టం' (వియ్ లవ్ రీడింగ్) కార్యక్రమం నిర్వహించాలన్నారు. పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులకు సమానంగా దత్తత నివ్వాలని, ఆయా ఉపాధ్యాయులు ఆ విద్యార్థులతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలన్నారు. సమీపంలోని లైబ్రరీలకు వెళ్లి దినపత్రికలు, కథలు, స్ఫూర్తిదాయక గ్రంథాలు చదివేలా ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారన్నారు. ఈ అంశాలను 28, 29 తేదీల్లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి వారికి తెలియజేయాలన్నారు. జిల్లాస్థాయి రిసోర్స్ పర్సన్, డైట్ లెక్చరర్ కె.గంగాధరరావు ఎస్‌పీఈ టూల్ ఆండ్రాయిడ్ అప్లికేషన్‌లో నమోదు చేయాల్సిన అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు.

కిక్ బాక్సింగ్ సెమినార్‌కు వెంకటరమణ



కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచ్ లైసెన్స్ అందుకుంటున్న గిరి వెంకటరమణ

రాజమహేంద్రవరం రూరల్: పూణేలో ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు జరిగిన కిక్ బాక్సింగ్ ఇంటర్నేషనల్ కోచింగ్ సెమినార్‌లో జిల్లా నుంచి కిక్ బాక్సింగ్ కోచ్ ఎన్.గిరి వెంకటరమణ పాల్గొన్నారు. ఎనిమిది రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ నిబంధనలు, మెలకువలు, నవీకరించిన సిలబస్‌పై తర్ఫీదు ఇచ్చారు. వాకో ప్రెసిడెంట్ కె.సంతోష్ అగర్వాల్, స్టేట్ సెక్రటరీ జి.ఆనంద బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం అర్హత పరీక్ష నిర్వహించారు. సెమినార్‌లోను, పరీక్షలో అర్హత సాధించిన కోచ్ గిరివెంకటరమణకు ట్రెనింగ్ సర్టిఫికెట్, కిక్‌బాక్సింగ్ ఇంటర్‌నేషనల్ కోచ్ లైసెన్సును అందజేశారు.

ఉపాధ్యాయుల నిరసన

కంబాలచెరువు: రాజమహేంద్రవరం బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతున్న పదోతరగతి పరీక్ష పేపర్ల వ్యాల్యూయేషన్ కేంద్రం వద్ద గురువారం భోజన విరామ సమయంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. చైర్మన్ పి.జయకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు విలువ ఉన్నప్పుడే మంచి విలువలున్న భావి సమాజం ఏర్పడుతుందన్నారు. కిందిస్థాయిలో ఉన్న విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను ఉన్నతాధికారులు సస్పెన్షన్ చేయడం దారుణమన్నారు. ఈ అక్రమ సస్పెన్షన్లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెక్రటరీ జనరల్ బి.శ్రీనివాస్, ఫ్యాప్టో కార్యవర్గం డి.దుర్గారావు, ఉదయ బ్రహ్మం, డేనియల్ షరీష్ పాల్గొన్నారు.